# హరిత గృహాలలో టమాట/చెర్రీ టమాట సాగు

హరిత గృహాలలో మొట్టమొదటిగా సాగు చేయబడిన కాయగూర పంట టమాట. కూర మిరప మరియు కీరదోస పంటలతో పోల్చినట్లయితే టమాట పంటను హరిత గృహాలలో సులువుగా సాగు చేసి అధిక దిగుబడి సాధించవచ్చు. తీగజాతి టమాట రకాలు హరిత గృహాలలో సాగుచేయటకు బాగా అనుకూలంగా ఉంటాయి. హరిత గృహాలలో సాగుచేసే టమాట రెండు రకాలు. మొదటిది సాధారణ టమాట (10 సెం.మీ. వ్యాసము గల కాయలు), రెండవది చెర్రీ టమాట (1-2 సెం.మీ. వ్యాసము గల కాయలు). చెర్రీ టమాటను సలాడ్‌లలో ఎక్కువగా వాడుతారు.

**వాతావరణము**: వేడిగా (18-$30^0$ సెల్సియస్) మరియు తేమగా ఉండే వాతావరణం టమాటకు బాగా అనుకూలంగా ఉంటుంది. మంచును మరియు తక్కువ ఉష్ణోగ్రతలను తట్టుకోలేదు. అయినప్పటికీ, దీనిని హరిత గృహాలలో డిసెంబరు - జనవరి మాసాలల్లో ముందస్తు వేసవి కాలపు పంటగా సాగుచేసుకోవచ్చును.

**నేలలు:** సేంద్రియ పదార్థము ఎక్కువగా ఉండి తటస్థ ఉదజని సూచిక 6.0-7.0, మురుగు నీరుపోయే సదుపాయము గల తేలికపాటి గరప మరియు పాటి నేలలు ఈ పంటకు మిక్కిలి అనుకూలము.

**ఎత్తైన మడుల తయారీ:**

**మట్టి నాణ్యత ప్రమాణాలు:**

- ఎర్ర మట్టి, నీటి ఇంకే స్వభావం, అదే విధంగా మొక్క నిలబడుటకు ఊతం ఇవ్వాలి.
- ఉదజని సూచిక 5.5-6.5, విద్యుత్ చాలకత (ఇ.సి.) 1 మిల్లీ మోస్.
- నీటిలో కరిగే లవణాలు తక్కువగాను, సేంద్రీయ పదార్థం ఎక్కువగాను ఉండాలి.
- ఎంచుకున్న మట్టిలో కలుపు గింజలు, నులి పురుగులు లేకుండా చూసుకోవాలి.

**మిశ్రమ తయారీకి ఇతరత్రా సేంద్రీయ పదార్థాలు :**

- కూరగాయలు ఎక్కువ సంవత్సరాలు పండించుటకు వీలుగా అత్యధికంగా అంటే 50% ఎర్ర మట్టి, 50% సేంద్రీయ పదార్థం కలుపుకోవాలి. ఈ సేంద్రీయ పదార్థం త్వరగా క్షీణించకుండ ఎక్కువ రోజులు ఉండే దాన్ని వీలున్నంత తక్కువ ఖర్చుతో, తేలికగా లభ్యమయ్యే దానిని ఎన్నుకోవాలి.
- ముఖ్యంగా బెడ్స్ తయారీకి పశువుల ఎరువు, వర్మికంపోస్టు, వరిపొట్టు, వేరు శనగచెక్కలు విరివిరిగా వాడవచ్చు, వీటిలో 3-4 రకాలు సేంద్రీయ పదార్థాలను పాలిహౌస్‌లోకి చేర్చి బాగా కలిపిన తరువాత బెడ్స్ తయారు చేసుకోవాలి. తర్వాత మిశ్రమాన్ని ఒక సారి పరీక్ష చేసి సరి చేసుకోవాలి.

**ఫ్యూమిగేషన్:**

మట్టి మిశ్రమంలో కీటకాలు, వేరు పురుగులు, చెదలు, నులి పురుగులు, రోగ కారకాలు లేకుండా చేయుటకు ఫార్మాల్డిహైడ్‌తో ఫ్యూమిగేట్ చేయాలి.

- పాలిహౌసుల్లో బెడ్స్ - కాలిబాట తయారు చేసుకున్న తర్వాత మట్టి అంతా తడిచే విధంగా ముందుగా నీటితో తడపాలి.

- 5 లీ. ఫార్మాల్డిహైడ్ మందును 200 లీ. నీటిలో కలపాలి. 1600 లీటర్ల మందు ద్రావణాన్ని తయారు చేసి, పాలిహౌసులోని మట్టి అంతా తడిచే విధంగా మందును 560 చదరపు మీటర్లలో వెదచల్లి వెంటనే పల్చని, నల్లటి పాలిషీట్‌ను గాలిచొరబడకుండా కప్పి, పాలిహౌస్ నలువైపులా షేడ్ నెట్‌ను కూడా మూసి ఆవిధంగా వారం రోజులు ఉండాలి.
- వారం రోజుల తర్వాత ప్లాస్టిక్ కాగితాన్ని తీసి, పాలిహౌస్ పైన, ప్రక్కల తెరలు కూడా తీసి, మట్టిని బాగా క్రింది నుంచి కలిపి మందు అవశేషాలు పూర్తిగా మట్టి నుంచి పోయేవిధంగా విస్తారంగా నీటిని చల్లాలి.
- మట్టి ఆరుదలకు వచ్చిన తర్వాత మరల బెడ్స్, కాలిబాటలు సూచించిన విస్తీర్ణంలో తయారు చేసుకోవాలి.
- హరిత గృహము లోపల నేలపై మట్టి మిశ్రమముతో తయారు చేసిన ఎత్తైన మడులు దాదాపు 4 సం. వరకు పంటలు పెంచడానికి అనువుగా ఉంటాయి. తగినంత వెడల్పు (75-90 సెం.మీ.) మరియు తగినంత ఎత్తు (30-40 సెం.మీ.) గల మడులను మడికి, మడికి మధ్య 45 సెం.మీ. అంతరము (కాలిబాట) ఉండే విధంగా చదునుగా తయారుచేసుకోవాలి.
- బెడ్స్ వంకర లేకుండా సమంగా, ఒకే ఎత్తులో తయారు చేసుకున్న తర్వాత ఒక మీటరు పొడవు ఉన్న బెడ్‌ను డిఏపి 100 గ్రా., మెగ్నీషియం సల్ఫేట్ - 50 గ్రా. బోరాన్ - 25గ్రా., సింగిల్ సూపర్ ఫాస్పేట్ - 250 గ్రా. వేసి బెడ్‌లో 15-20 సెం.మీ. లోతు వరకు కలిసే విధంగా కలపాలి.
- వేప చెక్క, ఆముదపు చెక్క, కరంజి చెక్క బెడ్స్ తయారీలో వాడవద్దు, ఇవి ఇసి పెరుగుటకు దోహదపడతాయి.

**డ్రిప్ పైపులను పరచుట:**

16 మి.మీ. వ్యాసము కలిగి ప్రతి 40 సెం.మీ. వద్ద నుండి గంటకు 2-4 లీ. నీటిని విడుదల చేసే ఇన్ లైన్ డ్రిప్ పైపులను మడి మధ్య భాగంలో పరచాలి.

**సాగు నీరు - వినియోగం:**

పాలిహౌసులలో పెంచే మొక్కలకు నాణ్యతాయుతమైన మంచి నీరు అవసరం. మొక్కలు పెంచుటకు అన్నీ రకాల శ్రద్ధ తీసుకున్నప్పటికి, నీటి నాణ్యత లోపించిన, దిగుబడులు, నాణ్యత బాగా తగ్గుటయే కాకుండా మొక్కలు త్వరగా చనిపోతాయి.

పాలిహౌసు మొక్కకు నీటి ఆవశ్యకత చాలా తక్కువ అంటే ఒక ఎకరా పాలిహౌసుకు రోజుకు 7000-8000 లీటర్ల నీరు వేసవిలో అవసరముంటుంది. అదే మిగతా కాలాల్లో ఇంకా తక్కువగానే అవసరం ఉంటుంది. అందు వలన నీటి నాణ్యతా పరీక్షలు పూర్తి చేసి, నీటి లభ్యతను చూసుకొన్న తరువాత పాలిహౌసులను నిర్మించాలి.

నేల లోతులతో సంభవించే మార్పుల వలన నీటి ఇసి, పిహెచ్, లవణ సాంద్రతలో మార్పులు వచ్చే అవకాశం కూడా ఉంది. అటువంటి సందర్భాలలో ఆర్ ఓ ప్లాంట్‌ను కూడా పెట్టి మంచి నీరు మొక్కలకు ఇవ్వవలసి ఉంటుంది.

**సాగు నీరు నాణ్యత ప్రమాణాలు:**

ఫర్టిగేషన్ పద్ధతిలో ఉపయోగించే నీటి నాణ్యత ముఖ్యమైన అంశం. నీటిని వాడే ముందు నాణ్యత పరీక్ష చేయాలి. ముఖ్యంగా ఉదజని సూచి, విద్యుత్ చాలకత, కరిగిన లవణాల శాతం తప్పనిసరిగా చూడాలి. నీరు పరిశుభ్రంగా ఉండాలి, లేని ఎడల ఫిల్టర్ వాడాలి లేకపోతే డ్రిప్ లేటరల్ పైప్ పై ఉన్న ఎమిటర్స్ మూసుకొని నీరు మొక్కలన్నింటికి సమంగా అందదు.

బోరు బావిలో నుంచి తీసిన నీటిలో ఎక్కువగా కాల్షియం, కార్బోనేట్స్, సల్ఫేట్స్, క్లోరైడ్స్, ఇనుము, మెగ్నీషియం, బోరాన్ అనే దాతువులు ఎక్కువగా ఉండే అవకాశం వలన బెడ్స్‌లో విద్యుత్‌చాలకత, ఉదజనిసూచిక పెరిగే అవకాశం ఉంది.

**రకాల ఎంపిక:**

హరిత గృహలలో టమాట సాగుకి తీగ జాతి సంకర రకాలు మిక్కిలి అనుకూలము.

| టమాట రకము | సంకర రకము |
|---|---|
| సాధారణ టమాట | హింసోనా, హింషేఖ్, ఇన్‌సోనా, 34774, అర్క వర్ధన్, అర్క విశాల్, అర్క రక్షక్, డిఏఆర్‌ఎల్-303, హెచ్‌టి-6, సన్-7611, ఎస్‌ఎస్-1237, లక్ష్మి, మీనాక్షి, అభిమాన్, పూసా దివ్య, నవీన్ పూసాదివ్య, సన్-7611, జిఎస్-600, స్నేహలత |
| చెర్రీ టమాట | జిల్లే, రై.జీ, టి-56, ఎన్‌ఎస్ చెర్రీ-1, ఎన్‌ఎస్ చెర్రీ-2 నాగ్ మోతీ, షీజా, రోజా, పూసా |

**నారు పెంపకం:** గుంతలు గల పళ్ళాలల్లో (ప్లగ్ ట్రేస్) పెంచినటువంటి 25 రోజుల వయస్సు గల నారును వేరు ముద్దతో సహా తీసి మడులపై నాటాలి.

**మొక్కలు నాటుట:** ఎత్తైన మడులపై రెండు సాళ్ళల్లో (జంట సాళ్ళ పద్ధతి) టమాట నారును నాటుకోవాలి. సాళ్ళ మధ్య 50 సెం.మీ. మరియు సాలులోని మొక్కల మధ్య 40 సెం.మీ. ఎడం ఉండే విధంగా పాదుకు ఒక మొక్క చొప్పున నాటాలి.

**బిందు సేద్యము ద్వారా పోషకాలు అందించుట:** ఎకరాకు 140:140:140 కి.గ్రా. నత్రజని, భాస్వరము మరియు పొటాష్ నిచ్చే నీటిలో కరిగే రసాయనిక ఎరువులను బిందు సేద్యం ద్వారా దఫాలుగా వారం రోజుల వ్యవధిలో మొక్కలకి అందించాలి.

**బిందు సేద్యము ద్వారా ఎరువుల యాజమాన్యము:**

మార్కెట్లో దొరికే, నీటిలో కరిగే రసాయన ఎరువులను బిందు సేద్యం ద్వారా నీటితో పాటు మొక్కల వేర్లకు అందించాలి.

| నీటిలోకరిగే రసాయన ఎరువు | నత్రజని(%) | భాస్వరం(%) | పొటాష్(%) | మెగ్నీషియం(%) |
|---|---|---|---|---|
| కాల్షియం నైట్రేట్ | 17.0 | - | - | - |
| డైపొటాషియం ఫాస్పేట్ | - | 17.78 | 45.0 | - |
| మెగ్నీషియం సల్ఫేట్ | - | - | - | 20.20 |
| మోనో అమ్మోనియా ఫాస్ఫేట్ | 12.0 | 26.93 | - | - |
| మోనో పొటాషియం ఫాస్ఫేట్ | - | 22.76 | 28.73 | - |
| ఫాస్ఫారిక్ ఆసిడ్ | - | 31.61 | - | - |
| అమ్మోనియా సల్ఫేట్ | 21.20 | - | - | - |
| సల్ఫేట్ ఆఫ్ పొటాష్ | - | - | 44.88 | - |
| యూరియా | 46.55 | - | - | - |

**కొమ్మల కత్తిరింపు మరియు శిక్షణ:** హరిత గృహాలలో సాగుచేసేటటువంటి తీగజాతి సంకర రకాలను నాటినప్పటి నుండి కొమ్మలు కత్తిరించి శిక్షణ నివ్వాలి. ఈ తీగజాతి రకాలలో ప్రతి మొక్కకు ఒక ప్రధాన కాండమును ఉంచి మిగతా ప్రక్క కొమ్మలను ఎప్పటికప్పుడు తీసివేయాలి. ఈ ప్రక్క కొమ్మలను లేత దశలో గోరుతో గిల్లి కూడా తొలగించవచ్చు. ఎదిగే టమాట మొక్కలను ప్లాస్టిక్ దారము సహాయంతో మొక్క మొదలు వద్ద కట్టి దారం కొన భాగాన్ని కప్పు క్రింది భాగములో 10 అడుగుల ఎత్తులో నేలకు సమాంతరంగా ఉన్నటువంటి జి.ఐ వైరుకు వదులుగా కట్టి మొక్కకి ఊతన్నివ్వాలి.

ఎదిగే మొక్క యొక్క ప్రధాన కాండాన్ని ప్రక్కనే ఉన్నటువంటి వదులైన ప్లాస్టిక్ దారానికి సవ్య దిశలో క్రింది నుంచి పైకి చుడుతూ పోవాలి. ఇలా చుట్టేటప్పుడు ప్లాస్టిక్ దారము పూల మరియు కాయ గుత్తుల మీద, ప్రధాన కాండపు కొన భాగం మీదకు రాకుండా కేవలము ఆకు కాడల క్రింద భాగములో ఉండేటట్లు చూసుకోవాలి. మొక్కలు 10 అడుగుల ఎత్తులో ఉన్నటువంటి జి.ఐ వైరుకి చేరుకోగానే తీగ కొనభాగాన్ని క్రిందకు వదలాలి. ఈ విధంగా మొక్కలను నిర్దిష్ట వ్యవధిలో ప్రక్క కొమ్మలు కత్తిరించి శిక్షణనిస్తే నాటిన తర్వాత 10-11 నెలల వరకు పూత మరియు కాత నిస్తాయి. మొక్క మొదలు భాగంలో ఉన్న కాయలు పరిపక్వదశకు చేరేటప్పుడు దాని క్రింది భాగంలో ఉండే ముదురు ఆకులను గిల్లి తొలగించాలి. కాయ గుత్తిలో ఎక్కువ సంఖ్యలో ఉన్నటువంటి కాయలను తొలి దశలోనే గమనించి తొలగించాలి. కాండానికి ఆకు కాడ కలిసే భాగము దగ్గర ఏర్పడిన పిలకలను గిల్లివేయాలి. పూ గుత్తులలో ఉన్నటువంటి ఆకులను కూడా తొలగించాలి.

**పరాగ సంపర్కము:** టమాటలో స్వపరాగ సంపర్కము జరిగినప్పటికీ, హరిత గృహాలలో సాగుచేసినప్పుడు పరాగ సంపర్కము సరిగా జరగకపోవటము వలన పిందె సరిగా కట్టదు. దీనిని అధిగమించడానికి హరిత గృహాలలో బంబుల్ బీ/ తేనెటీగల పెట్టెలను అమర్చాలి. దీనితోపాటుగా వైబ్రేటర్స్‌ను ఉదయము పూట మొక్కలకి తాకించి కూడా పరాగ సంపర్కాన్ని ప్రోత్సహించవచ్చు.

**కాయ కోత మరియు దిగుబడి:** పంట నాటిన 75-80 రోజులలో కాయ కోత మొదలై 10-11 నెలల వరకు కొనసాగుతుంది. ప్రతి రోజు గాని లేదా రోజు మార్చి రోజు గాని కాయకోత చేపట్టాలి. దూర ప్రాంతాలకు రవాణా చేయుటకు వీలుగా కాయలను పూర్తిగా ఎదిగిన ఆకుపచ్చ రంగు దశలోగాని లేక రంగు మారు దశలో గాని కోయాలి. హరిత గృహాలలో సాగుచేసినటువంటి సాధారణ తీగజాతి సంకర టమాటాలో హెక్టారుకి దాదాపు 250-300 టన్నులు, అదే చెర్రీ టమాటలో హెక్టారుకు 100-150 టన్నుల దిగుబడిని పొందవచ్చు.

## సస్యరక్షణ

### పురుగులు

**పాముపొడ:** ఆకులపై పాము ఆకారపు తెల్లటి పొడలు ఏర్పడతాయి. నివారణకు వేప గింజల కషాయం (5%) లేక ఇమామేక్టిన్ బెంజోయేట్ (0.4 గ్రా./లీ.) పిచికారి చేయాలి.

**తెల్లదోమ:** ఈ పురుగులు మొక్కల నుండి రసం పీల్చడం వలన ఆకులు పసుపు రంగులోకి మారి, ముడుచుకుపోతాయి. నివారణకు పసుపు రంగు డబ్బాలకు గ్రీజు లేదా ఆముదం పూసి హరిత గృహంలో అక్కడక్కడ పెట్టి పురుగు ఉధృతిని గమనించాలి. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ (0.3 మి.లీ./లీ.) లేదా థయోమిథాక్సమ్ (0.3 గ్రా./లీ.) తో నాటే ముందు నారు మడిని తడుపుకోవాలి. ఇమిడాక్లోప్రిడ్ (0.3 మి.లీ./లీ.) లేదా థయోమిథాక్సమ్ (0.3 గ్రా./లీ.) నాటిన 15 రోజుల తరువాత పిచికారి చేయాలి.

**ఎర్రనల్లి:** పసుపు లేదా తెల్లటి మచ్చలు ఆకుల పైభాగన కనిపిస్తాయి. నివారణకు నీటిలో కరిగే గంధకం పొడి (3 గ్రా./లీ.) లేదా డైకోఫాల్ (3.0 మి.లీ./లీ.) లేదా ఫెనజాక్విన్ (2.5 మి.లీ./లీ.) లేదా అబామెక్టిన్ (0.5 మి.లీ./లీ.) పిచికారి చేసుకోవాలి.

**కాయ తొలుచు పురుగు:** కాయలపై కనిపించేటటువంటి గుండ్రటి రంధ్రాలను బట్టి పురుగు ఆశించినట్లు గమనించవచ్చు. హరిత గృహంలో లింగాకర్షక బుట్టలు ఎకరానికి 5 చొప్పున పెట్టాలి. అవసరాన్ని బట్టి పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న యెడల స్పైనోసాడ్ (0.3 మి.లీ/లీ.) లేదా థయోడికార్బ్ (1 గ్రా./లీ.) లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ (0.4 గ్రా./లీ.) లేదా ఫ్లూబెండమైడ్ (0.3 మి.లీ./లీ.) పిచికారి చేయాలి.

**తెగుళ్ళు**

**నారుకుళ్ళు తెగులు:** ఈ తెగులు ఆశించిన మొక్క ఆకస్మికంగా వడలి చనిపోతాయి. నివారణకు కార్బండజిమ్ (1. గ్రా./లీ.) లేక మెటలాక్సిల్ ఎంజడ్ (2 గ్రా./లీ.) లేక కాపర్ ఆక్సీక్లోరైడ్ (3 గ్రా./లీ.) ద్రావణాన్ని మొక్క మొదలు వద్ద ముంపుగా తడపాలి.

**ఫ్యుజేరియం ఎండుతెగులు:** ఈ తెగులు ఆశించిన మొక్కలు ఒకవైపు నుంచి వడలి ఎండి పోతాయి. కాండము మీద బెరడుని తొలిచి చూస్తే గోధుమ వర్ణములో ఉంటుంది. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ (3 గ్రా./లీ.) ద్రావణంను మొక్క మొదలు వద్ద ముంపుగా తడుచేటట్లు పోయాలి. మొక్కలపై కార్బండజమ్ + మ్యాంకోజెబ్ (2 గ్రా./లీ.) పిచికారి చేయాలి.

**బాక్టీరియా ఎండు తెగులు:** ఈ తెగులు ఆశించిన మొక్కలు ఉన్నట్టుండి ఎండి పోతాయి. నివారణకు పంట మార్పిడి చేయాలి. నారును తీసిన తరువాత 8 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ 40 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణంలో 15 ని॥ ఉంచి నాటుకోవాలి.

**బూడిద తెగులు:** చిన్న చిన్న పసుపు పచ్చని మచ్చలతో పాటు బూడిద లాంటి పొడి ఆకు అడుగు భాగంలో ఏర్పడుతుంది. ఉధృతి ఎక్కువైనప్పుడు ఆకులు ఎండి రాలిపోతాయి. నీటిలో కరిగే గంధకపు పొడి (3 గ్రా./లీ.) లేదా హెక్సాకొనజోల్ (2.0 మి.లీ./లీ.) లేక మైక్లోబుటానిల్ (1 గ్రా./లీ.) లేక డైనోకాప్ (1 గ్రా./లీ.) లేక ఫెన్‌కొనజోల్ (0.5 మి.లీ./లీ.) పిచికారి చేయాలి.

**ఆకుమాడు తెగులు:** ఈ తెగులు ఆశించిన మొక్కల మొదళ్ళ వద్ద, కాండము పైన, కొమ్మలపైన బూడిద రంగు నీటి మచ్చలు ఏర్పడతాయి. నారు మొక్కలను ట్రైకోడెర్మా (10 శాతం) ద్రావణంలో 15 నిమిషాలు ఉంచి నాటుకోవాలి. బోర్డోమిశ్రమము (1:1:100)తో మడులను తడపాలి. మెటలాక్సిల్ (2 గ్రా./లీ.) లేదా మెటలాక్సిల్ + మ్యాంకోజెబ్ (2.5 గ్రా./లీ.) పిచికారి చేయాలి.

**సెర్కోస్పోరా ఆకుమచ్చ తెగులు:** ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడటం వలన ఆకులు ముడుచుకొని ఎండి రాలి పోతాయి. నివారణకు తెగులు ఆశించిన క్రింది ఆకులను తొలగించి డైఫెన్‌కొనజోల్ (0.5 మి.లీ./లీ.) ప్రొపికొనజోల్ (1 గ్రా./లీ.) లేదా కార్బండజిమ్ (1 గ్రా./లీ.) పిచికారి చేయాలి.

**ఆకుముడత వైరస్ తెగులు:** ఆకులు పైకి మరియు క్రిందకి ముడుచుకొని, పసుపుపచ్చ మచ్చలను కలిగి ఉంటాయి. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 5 గ్రా. కిలోవిత్తనానికి కలిపి విత్తుకోవాలి. వైరస్ తెగులు ఆశించిన మొక్కలను పెరికి నాశనము చేయాలి. రసం పీల్చే పేనుబంక మరియు తామర పురుగులను ఎప్పటికప్పుడు నివారణ చేయాలి.

**టమాట మచ్చల మాడు వైరస్ తెగులు:** చిగురుటాకుల పైభాగంలో గోధుమ వర్ణముతో కూడిన పసుపు రంగు మచ్చలు ఏర్పడి ఆకులు క్రింది వైపున వంగిపోతాయి. వైరస్ తెగులు ఆశించిన మొక్కలను పెరికి నాశనము చేయాలి. రసం పీల్చే పేనుబంక మరియు తామర పురుగులను ఎప్పటికప్పుడు నివారణ చేయాలి.

చెర్రీటమాట సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన చిరునామా
**సీనియర్ సైంటిస్ట్ (హార్టికల్చర్) మరియు హెడ్, కూరగాయల పరిశోధనా స్థానం,**
రాజేంద్రనగర్, హైదరాబాద్. ఫోన్: 040-24018016